క్లుప్తంగా

30, 31న జిల్లా మహాసభలు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఈ నెల 30, 31న కడప నగరంలో నిర్వహిస్తున్న ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉద్దె మద్దిలేటి, జిల్లా అధ్యక్షులు వై.హరి పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆటో కార్మికులకు పీఎఫ్ ఈఎస్ఐ పెన్షన్ తో కూడిన సంక్షేమ బోర్డు ను ఏర్పాటు చేయాలన్నారు. నగరంలో ఈ నెల 30న పాత రిమ్స్ ఆటో స్టాండ్ నుండి ఎన్టీఆర్ సర్కిల్, కోటిరెడ్డి సర్కిల్, మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీస్ మీదుగా, ప్రెస్ క్లబ్ వరకు ర్యాలీ నిర్వహించి బహిరంగ సభ సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ అనుబంధం కడప నగర అధ్యక్ష కార్యదర్శులు వి. పుల్లయ్య, ఏ.నారాయణ, నగర నాయకులు రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



మాసాపేట సర్కిల్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ హుసేన్

కడప అర్బన్ : కడప నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మాసాపేట సర్కిల్‌లో ఎస్ఐ ఎస్‌కెఎం హుసేన్ ఆధ్వర్యంలో తమ సిబ్బందితో కలిసి మంగళవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి వాహనదారులకు సూచనలు చేశారు. డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ, కాలుష్య నివారణ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ కాపీలను తప్పకుండా వాహనాలను నడుపుతున్న సమయంలో ఉంచుకోవాలన్నారు.

నడిరోడ్డుపై గుంత



ఫక్కీరుపల్లెకు పోయే మార్గంలో నడిరోడ్డుపై ఏర్పడిన గుంత

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని గురుకుల్ విద్యాపీఠ్ వెనుక, ఫక్కీరుపల్లెకు పోయే మార్గంలో నడిరోడ్డుపై గుంత ఏర్పడింది. భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ వల్లే ఈ గుంత ఏర్పడినట్లు తెలుస్తోంది. ఇటీవల ప్రభుత్వం రోడ్లపై ఉన్న గుంతలన్నింటినీ పూడ్చివేసింది. అందులో భాగంగా ఈ గుంతను కూడా పూడ్చారు. కానీ కొన్ని రోజులకే ఇలా మళ్లీ గుంత ఏర్పడి అందులో డ్రైనేజీ నీరు నిలుస్తున్నాయి. ఈ గుంతలో వాహనాల టైర్లు పడినప్పుడు డ్రైనేజీ నీరు పాదచారులపై పడుతున్నాయి. అధికారులు స్పందించి ఈ గుంతను పూడ్చివేయాలని పలువురు కోరుతున్నారు.

పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలి

కడప సెవెన్‌రోడ్స్ : కలెక్టర్ కార్యాలయ ఆవరణలో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలని ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాలా జయవర్ధన్ మంగళవారం డీఆర్వో విశ్వేశ్వరనాయుడుకు వినతిపత్రాన్ని సమర్పించారు. ప్రతిరోజు కొన్ని వందల మంది ప్రజలు కలెక్టరేట్ ఆవరణలోని కార్యాలయాలకు వస్తుంటారని, టాయిలెట్స్ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎక్కువ శాతం మహిళలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సోమవారం జరిగే పబ్లిక్ గ్రీవెన్స్‌సెల్‌కు జిల్లా వ్యాప్తంగా ప్రజలు వస్తుంటారన్నారు. ఈ అంశంపై పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అఖిల భారత ఆగ్రహం మహిళా సమితి రాష్ట్ర కార్యదర్శి సుబ్బమ్మ, జిల్లా కన్వీనర్ అరుణకుమారి, అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాయలసీమ కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

కడప కల్చరల్ : జిల్లాలో ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీ నిత్యపూజాస్వామి ఆలయ పరిధిలో మహాశివరాత్రి వేడుకలు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వహించాలని కడప నగరానికి చెందిన నాగదాసరి మునికుమార్ కోరారు. మంగళవారం ఆయన రహదారులు, భవనాలశాఖ సూపరింటెండింగ్ ఇంజనీరు, కార్యనిర్వాహక ఇంజనీరు, అటవీశాఖ అధికారికి ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. సిద్దవటం -నిత్యపూజకోన రోడ్డుకు మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగానైనా తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని ఆయన విన్నవించారు.

ఆర్‌ఐఓకు వినతి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఆర్‌ఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జగన్, లింగమయ్యలు డిమాండ్ చేశారు. మంగళవారం కడపలోని ఇంటర్ ఆర్‌ఐఓను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనకు విరుద్ధంగా అపార్ట్‌మెంట్లలో, షాపింగ్ కాంప్లెక్స్‌లలో ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారన్నారు. అలాంటి కళాశాలలపై విచారణ జరిగి చర్యలు తీసుకోవాలన్నారు.

కడపరాయా.. దీవించవయ్యా..



దేవుని కడప ఆలయంలో కాంతులీనుతున్న ప్రధాన గోపురం

దేవుని కడపలో మంగళవారం బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. కడపరాయుడి ఆలయం విద్యుత్ దీప కాంతులతో దేదీప్యమానంగా వెలుగొందుతోంది. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఇక మహిళలు కోలాట ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. జిల్లా వ్యాప్తంగా భక్తులు దేవదేవుడి దర్శనం కోసం తరలివచ్చారు.

– ఫొటోలు: సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్, కడప



పుట్ట మన్ను తెస్తున్న అర్చకులు



వాయిద్యాలతో కళాకారులు



మహిళల కోలాటం



వేతనాలను పెంచాలి

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికుల వేతనాలను పెంచాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు అజాముద్దీన్, ఎస్‌ఎండీ ఖాసీం , రామసుబ్బారెడ్డి, ఆనంద్ కోరారు. మంగళవారం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కార్పొరేషన్ కార్యాలయం వద్ద సమావేశమై తమ సమస్యల గూర్చి చర్చించారు. పెరిగిన నిత్యావసర ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలకు ప్రస్తుతం ఇస్తున్న రూ.13 వేల జీతం ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. ఇంజనీరింగ్ సెక్షన్ లో 350 మంది ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్నారని చెప్పారు. అన్ని రకాల చార్జీలు, ధరలు పెరిగిన నేపథ్యంలో వాటికి అనుగుణంగా వేతనాలను పెంచాలన్నారు. సమాన పనికి సమాన వేతనం అందించాలని కోరారు.

సమన్వయ సమావేశాన్ని నిర్వహించాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలోని అన్ని ఉపాధ్యాయ సంఘాలతో ఒక సమన్వయ సమావేశాన్ని నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని డీఈఓ షంషుద్దీన్‌ను నోబెల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఏబీ రామకృష్ణంరాజు కోరారు. ఎన్‌టీఏ గౌరవాధ్యక్షులు కూరాకు రవీంద్ర ఆధ్వర్యంలో డీఈఓగా బాధ్యతలు చేపట్టిన షంషుద్దీన్‌ను మంగళవారం కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా నోబెల్ టీచర్స్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్‌ను డీఈఓ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్లు అబ్దుల్ గఫూర్, వారాల శ్రీనివాసులు, జిల్లా ఆర్థిక కార్యదర్శి అవధానం చలపతిరాజు, జిల్లా నాయకులు లక్ష్మినారాయణ, బిసి సుబ్బరాయుడు, అఫ్జల్ బాష, రవీంద్రనాథ్, వెంకటేశ్వర్లు తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలల ఉనికి కోసం ఉద్యమిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న కొర్రా సురేష్‌బాబు

కడప ఎడ్యుకేషన్ : ప్రాథమిక పాఠశాలల ఉనికి కోసమై ఉద్యమిస్తామని ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కొర్రా సురేష్‌బాబు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి 117 జీవో రద్దు కోరుకున్నాం కానీ ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, పాఠశాలల పునర్నిర్మాణ ప్రక్రియ పేరుతో తిరిగి పాఠశాలల విలీనాన్ని వ్యతిరేకిస్తున్నామని ఆయన అన్నారు. మంగళవారం కడపలోని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 117 జీవోను రద్దు చేస్తూ ఐదు రకాల పాఠశాలల ఏర్పాటుకు పాఠశాలల పునఃనిర్మాణ ప్రక్రియ అమలు కోసం ప్రభుత్వం విడుదల చేసిన మెమోపై అవగాహన కోసం కమిషనర్ జిల్లాల పర్యటన చేస్తున్నారన్నారు. అయితే పర్యటన అనంతరం కొన్ని వాస్తవాలు బయటికి వచ్చాయన్నారు. ప్రభుత్వ ఉద్దేశం మేరకు ఒక గ్రామ పంచాయతీలో ఒక మోడల్ ప్రైమరీ స్కూలు, మిగిలినవి ఫౌండేషన్ స్కూల్స్ గా ఉంచాలని చూస్తోందన్నారు. గ్రామ పంచాయతీలోని గ్రామాల మధ్య దూరం ఒక కిలోమీటర్ కంటే ఎక్కువగా ఉన్న పరిస్థితుల్లో 3,4,5 తరగతుల తరలింపు సమంజసం కాదని అన్నారు. ఇంకా పలు అంశాలపై ఆయన వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలగంగిరెడ్డి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇలియాస్ బాషా, నర్రెడ్డి సంగమేశ్వర రెడ్డి, నాయకులు రామ మోహన్, రవిశంకర్ రెడ్డి, చెన్నకేశవరెడ్డి, కృష్ణా నాయక్, పద్మాకర్, రెడ్డెన్న, వెంకటసుబ్బయ్య, సాదిక్, జయరాం పాల్గొన్నారు.

బాలోత్సవం జయప్రదం చేద్దాం



మీడియాతో మాట్లాడుతున్న బాలోత్సవ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు

కడప కల్చరల్ : కడప బాలోత్సవంలో భాగంగా ఫిబ్రవరి 1, 2 తేదీల్లో కడప సెయింట్ జోసెఫ్స్ జూనియర్ కళాశాలలో నిర్వహించనున్న రెండు రోజుల పిల్లల పండుగను జయప్రదం చేద్దామని ఉత్సవ నిర్వహణ కమిటీ ప్రతినిధులు పిలుపునిచ్చారు. మంగళవారం కడప నగరంలోని శ్రీ శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో కమిటీ బాధ్యులు నాగమల్లారెడ్డి మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులకు తరగతి గదులే లోకంగా మారుతున్నాయని, అలాంటి వారికి బయటి ప్రపంచం చూపాలని రెండు రోజులు పూర్తిగా ఆటపాటలతో ఆనందంగా గడిపి బాల్యంలోని మాధుర్యాన్ని చవిచూపేందుకు ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. మరో ప్రతినిధి గుర్రాల గోపాల్ మాట్లాడుతూ ఈ రెండు రోజులు పిల్లలకు 50 రకాల పోటీలను నిర్వహిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. కమిటీ ప్రతినిధి రాజశేఖర్ రాహుల్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు ఈ ఉత్సవాల్లో పాల్గొంటారని, ప్రత్యేకంగా గూగుల్ ద్వారా దరఖాస్తులను పంపే ఏర్పాటు చేశామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ వీర సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ కార్యక్రమాలకు సహకారం అందించేందుకు తమ కళాశాల విద్యార్థులు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

అందుబాటులోకి రోడ్డు సౌకర్యం



దేవుని కడప రోడ్డులోని గౌస్ నగర్ వద్ద వేసిన తారురోడ్డు

కడప కల్చరల్ : మాసాపేట సర్కిల్ నుంచి దేవునికడప వెళ్లే రోడ్డుకు మోక్షం లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు అధికారుల పర్యవేక్షణలో కార్మికులు మరమ్మతులు చేపట్టారు. మాసాపేట నుంచి దేవునికడపకు వెళ్లే దారి కంకర తేలి ఉండటాన్ని ఈనెల 24న సాక్షి 'ఉత్సవాలు సరే... రోడ్డు మాటేమిటి' శీర్షికన కథనాన్ని ప్రచురించింది. స్పందించిన అధికారులు సోమవారం రేయింబవళ్లు రోడ్డుకు మరమ్మతులు చేశారు. మాసాపేట సర్కిల్ నుంచి చేపల చెరువు వరకు తారురోడ్డు వేశారు. దేవునికడప ఆలయం చుట్టూ గల వీధుల్లో రోడ్ల పరిస్థితి కూడా ఇలాగే ఉండడంతో ఈ విషయాన్ని సాక్షి కథనంలో ప్రస్తావించింది. దీంతో అధికారులు కథనం ప్రచురితమైన మరుసటిరోజు నుంచి ఆ రోడ్లకు మరమ్మతులు చేపట్టి మంగళవారం రాత్రికి పూర్తిచేశారు. సాక్షి కథనంతో రోడ్డు బాగుపడడం వల్ల స్థానికులు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దుర్గమ్మ సన్నిధిలో పూజలు



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు. నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఫిబ్రవరి 3న సోమవారం వసంత పంచమిని పురస్కరించుకుని ఉదయం 10 గంటలకు ఆలయంలో శ్రీ సరస్వతిమాత పూజ నిర్వహించనున్నారు. 4న రథసప్తమిని పురస్కరించుకుని నవగ్రహ మండపంలోని సూర్య భగవానుడికి ప్రత్యేక అభిషేకం చేస్తామని తెలిపారు.

30న జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా ఉపాధి కార్యాలయం, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన కమలాపురంలోని వెలుగు కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఐసీలో బీమా శక్తి, నవత ట్రాన్స్‌పోర్టులో క్లర్క్, డ్రైవర్, క్లీనర్స్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. 5వ తరగతి, టెన్త్, డిగ్రీ, పీజీ చదివి 18–50 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. ఎంపికయిన వారికి హోదాను బట్టి రూ. 7 వేల నుంచి రూ.35 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. అభ్యర్థులు విద్యార్హతలు, ఫొటోలతో ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చని ఆయన సూచించారు.

మైదుకూరులో..

మైదుకూరులోని వెలుగు కార్యాలయంలో ఈనెల 29వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నవత ట్రాన్స్‌పోర్టులో క్లర్క్, డ్రైవర్లు, క్లీనర్స్ ఉద్యోగాలకు, అల్ డిక్సన్‌లో అసెంబ్లింగ్ ఆపరేటర్లు, ఎల్ఐసీలో బీమా శక్తి ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. అభ్యర్థులు 5వ తరగతి, టెన్త్, డిగ్రీ, పీజీ చదివి 18–50 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులన్నారు.

ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గంలో ముగ్గురికి చోటు

కడప ఎడ్యుకేషన్ : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని అల్లూరి సీతారామరాజు నగరంలో ఈ నెల 24, 25, 26వ తేదీలలో 43వ రాష్ట్ర మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. అందులో భాగంగా కడప నగరానికి చెందిన పవన్, లక్ష్మి, యోగివేమన యూనివర్సిటీ నుండి జావీద్‌లను రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలపై నిరంతరం అలుపెరుగని పోరాటాలు చేస్తూ విద్యార్థుల భవిష్యత్తు కోసం కృషి చేస్తామన్నారు.

ఘన నివాళి

కడప ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్రంలో తిరుగులేని సంఘంగా పురోభివృద్ధి సాధించడంలో నూతలపాటి పరమేశ్వరరావు కృషి ఎనలేనిదని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ. శ్యాంసుందర్ రెడ్డి పేర్కొన్నారు. పరమేశ్వరరావు తృతీయ వర్ధంతి సందర్భంగా మంగళవారం కడపలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరమేశ్వరరావు 25 సంవత్సరాలపాటు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగాను, ఉపాధ్యాయ పత్రిక సంపాదకుడిగాను పనిచేశారన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించడానికి మనందరం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్ బాష, శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రిలిమ్స్ పరీక్షలలో అర్హత సాధించిన పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులందరికీ ఫిజికల్ ఈవెంట్స్ లో అవకాశం కల్పించి వారికి న్యాయం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్, అధ్యక్షుడు ముడియం చిన్ని పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వం పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ నిమిత్తం 2022 నవంబర్ 28న 6100 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. 2023 జనవరి 22న ప్రిలిమ్స్ పరీక్షకు 4,59, 182 మంది హాజరయ్యారన్నారు. 95,208 మంది అర్హత సాధించారని.. ఈలోగా ఎమ్మెల్సీ ఎన్నికలు, కోర్టు కేసులు ఫలితంగా గత రెండేళ్లు నుంచి ప్రభుత్వం వాయిదా వేస్తూ వచ్చిందన్నారు. ఇప్పుడు ఫిజికల్ ఈవెంట్స్ కు మీకు వయసు లేదు అని అభ్యర్థులను తిరస్కరించడం అన్యాయమన్నారు. రాష్ట్రంలో పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న 20వేల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రెబ్బా నరసింహులు, నగర కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

ఆర్‌జేడీ కార్యాలయం ఎదుట ఆందోళన



ఆర్‌జేడీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : అన్నమయ్య జిల్లా ములకలచెరువు కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులకు తీవ్ర ఇబ్బందులు, వేధింపులకు గురి చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై మంగళవారం కడప ఆర్‌జేడీ కార్యాలయం ఎదుట పీడీఎస్‌యూ నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.అంకన్న మాట్లాడుతూ ములకలచెరువు కస్తూరిబా గాంధీ పాఠశాలలో సామాజిక తనిఖీలో భాగంగా అధికారులు వచ్చిన సందర్భంలో విద్యార్థినులు తమ సమస్యలను వారికి విన్నవించారన్నారు. ప్రధానంగా శానిటరీ ప్యాడ్‌ల విషయంలో ఇబ్బంది పెడుతున్నారన్నారు. ఇంకా పలు విషయాలలో ఇబ్బంది పెడుతున్నారన్నారు. ఇలాంటి ఘటనలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్‌జేడీ కార్యాలయంలో వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు మనోజ్, సమీర్, శివ ప్రసాద్, వెంకటరమణ, పురుషోత్తం, అన్నమయ్య జిల్లా పీడీఎస్‌యూ నాయకులు రేవంత్, సుహేల్, సాయి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలలను బలోపేతం చేయండి



డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న రూట నాయకులు

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలోని ఉర్దూ మాధ్యమ ప్రాథమికోన్నత పాఠశాలలన్నింటిని ఉన్నత పాఠశాలలుగా ఉన్నతీకరించాలని తద్వారా మైనారిటీ విద్యార్థిని, విద్యార్థుల డ్రాప్ ఔట్ శాతం తగ్గుముఖం పడుతుందని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, జుబేర్ అహ్మద్‌లు అన్నారు. నూతన డీఈఓగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఎస్. షంషుద్దీన్‌కు పలు సమస్యలకు సంబంధించిన వినతిపత్రాన్ని వారు మంగళవారం సమర్పించారు. రూట రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు హాజి సత్తార్ ఫైజి, డైరీ కమిటీ చైర్మన్ హాజీ అబ్దుల్ హకీమ్‌లు మాట్లాడుతూ ముస్లిం మైనారిటీల అధిక జనాభా కలిగిన ఆవాసాలలో నూతన ఉర్దూ ప్రాథమిక పాఠశాలలను స్థాపించాలని విజ్ఞప్తి చేశారు. రూట రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ముహమ్మద్ అయ్యూబ్ పలు సమస్యలను డీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం డీఈఓను సత్కరించి రూట డైరీ, క్యాలెండర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓ కార్యాలయ ఏడీ మునీర్ ఖాన్, సూపరింటెండెంట్ బాదుల్లా, రాష్ట్ర డైరీ కో చైర్మన్ సయ్యద్ సిరాజుద్దీన్, రాష్ట్ర కన్వీనర్ బెపారి ఫక్రుద్దీన్, జిల్లా ఉపాధ్యక్షులు ముహమ్మద్ అస్లం తదితరులు పాల్గొన్నారు.

పెద్దదర్గాలో సినీ బృందం ప్రార్థనలు



దర్గాలో చాదర్ సమర్పిస్తున్న సినీ బృందం

కడప కల్చరల్ : ప్రఖ్యాత అమీన్‌పీర్ (పెద్ద)దర్గాను మంగళవారం సినీ బృందం దర్శించుకుంది. రాచరికం సినిమా హీరో హీరోయిన్‌లు విజయశంకర్, అప్సరా రాణి, దర్శకుడు సురేష్ లంకలపల్లి, ఈశ్వర్, చాణక్యలు దర్గాకు రాగా నిర్వాహకులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. సినీ బృందం తలపై చాదర్ పెట్టుకుని దర్గా గురువుల మజార్ వద్ద సమర్పించి మొక్కుకున్నారు. అనంతరం దర్గాలోని ప్రధాన గురువుల మజార్ వద్ద ప్రార్థనలు నిర్వహించారు. దర్గా ముజావర్ అమీర్ వారికి దర్గా విశిష్టత, చరిత్ర గురించి వివరించారు.

'రాచరికం' చిత్రంను జయప్రదం చేయాలి

కడప రూరల్ : రాయలసీమ నేపథ్యంలో వైవిధ్య భరితమైన కథాంశంతో నిర్మించిన రాచరికం చిత్రంను జయప్రదం చేయాలని ఆ చిత్రం యూనిట్ సభ్యులు తెలిపారు. మంగళవారం కడప నగరంలోని స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో ఆ చిత్రం వివరాలను తెలిపారు. హీరో జయశంకర్, హీరోయిన్ అప్సర రాణి , చిత్రం దర్శకులు సురేష్ లంకలపల్లి, నిర్మాత ఈశ్వర్ మాట్లాడుతూ ఈ చిత్రం ఈ నెల 31వ తేదీన విడుదలవుతున్నట్లు చెప్పారు.

ధ్యానంతో మానసిక భావోద్వేగ వికాసం



సమావేశంలో మాట్లాడుతున్న శిరీష

కడప ఎడ్యుకేషన్ : మానసిక భావోద్వేగ వికాసానికి దోహదపడేందుకు ధ్యానం టానిక్‌లా పనిచేస్తుందని వైవీయూ వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం సైన్స్ బ్లాక్‌లోని సెమినార్ హాల్‌లో విశాఖపట్నంలోని దివ్య బాబాజీ సుషుమ్న యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ధ్యానంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ మన మనస్సు ఆందోళన నుంచి విముక్తి పొంది ప్రశాంతతను ఇవ్వడంలో ధ్యానం సహకరిస్తుందన్నారు. ప్రిన్సిపల్ ఆచార్య ఎస్. రఘునాథ రెడ్డి మాట్లాడుతూ ఏకాగ్రతను పెంపొందించడానికి, ఒత్తిడిని నియంత్రించడానికి ధ్యానం ఉపయోగపడుతుందన్నారు. కుల సచివులు ఆచార్య పి పద్మ, విశాఖపట్నంలోని దివ్య బాబాజీ సుషుమ్న యోగా ఫౌండేషన్ కార్యదర్శి ఆర్.శిరీష మాట్లాడుతూ ధ్యానం ద్వారా కలిగే ప్రయోజనాలు వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్‌లు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.